# 31 అర్ధరాత్రి వరకు మద్యం

- తాగి వాహనం నడిపితే ఆరు నెలలు జైలుకు, రూ.10వేలు జరిమానా
- పబ్బులు, బార్లలోకి మైనర్లు, రివాల్వర్,మారణాయుధాలను అనుమతించవద్దు
- వేడుకలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి
- మద్యం సేవించిన వారికోసం డ్రైవర్లను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నిర్వాహకులదే
- ఫ్లై ఓవర్లన్నీ రాత్రి 10నుంచి ఉదయం 5గంటల వరకు మూసివేత
- క్యాబ్ డ్రైవర్లు రైడ్ నిరాకరిస్తే 9490617346 ఫిర్యాదు చేయండి
- ఆదేశాలు జారీ చేసిన ట్రై పోలీస్ కమిషనర్లు



సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : కొత్త సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 31 అర్ధరాత్రి ఒంటిగంట వరకు పబ్బులు, క్లబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లు, న్యూఇయర్ ఈవెంట్లలో మద్యం సరఫరాకు అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. నూతన సంవత్సరానికి వీడుకోలు పలికే 31 డిసెంబర్‌ను పురస్కరించుకొని పలు ఆంక్షలు, మార్గదర్శకాలను జారీచేశారు. జంటలు, పెద్దల కోసం నిర్వహించే కొత్త సంవత్సర వేడుకలతో పాటు పబ్బులు, క్లబ్బులు, బార్లలలో మైనర్లను అనుమతించవద్దని కమిషనర్లు నిర్వాహకులను ఆదేశించారు. ఈవెంట్లలోకి రివాల్వర్ వంటి మారణాయుధాలతో రావద్దని, అశ్లీల నృత్యాలు, అసభ్యకర దృశ్యాలు ప్రదర్శించడం, వ్యభిచారం వంటి వాటిని ప్రోత్సహించడం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అనుమతించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవెంట్ జరిగే ప్రాంగణంలో సౌండ్ 45డిసెబుల్‌ను మించకూడదని, సామర్థ్యానికి మించి రద్దీని అనుమతించరాదని, ఇష్టానుసారంగా పాసులు, టికెట్లను విక్రయించరాదని హెచ్చరించారు.

### సీసీ కెమెరాలతో నిఘా తప్పనిసరి

ఈవెంట్లు జరిగే ప్రాంతంలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నిర్వాహకులదేనన్నారు. ఈవెంట్ వద్ద ఏర్పాటు చేసిన ఎంట్రీ, ఎగ్జిట్‌తో పాటు పార్కింగ్ ప్రాంతాల్లో సైతం సీసీ కెమెరాలను అమర్చాలని, వేడుకలు ముగిసిన తరువాత వాటి ఫుటేజిలను పోలీసులకు సమర్పించాలని తెలిపారు. మద్యం సేవించిన వారిని వాహనాలు నడిపేందుకు అనుమతించరాదని, వారికోసం డ్రైవర్లను ఏర్పాటు చేసే బాధ్యత కూడా నిర్వాహకులదేనన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే 6నెలల జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్సను సస్పెండ్ చేయనున్నట్లు తెలిపారు.

### రాత్రి 10 నుంచి ఫ్లై ఓవర్లు మూసివేత

శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్, గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, షేక్‌పేట, మైండ్‌స్పేస్, దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి, రోడ్డు నంబర్ 45 ఫ్లైఓవర్, సైబర్ టవర్ ఫ్లైఓవర్, ఫోరమ్ మాల్–జేఎన్‌టీయూ ఫ్లైఓవర్, ఖైత్లాపూర్ ఫ్లైఓవర్, బాలానగర్ ఫ్లైఓవర్‌లను రాత్రి 10 నుంచి ఉదయం 5గంటల వరకు పూర్తిగా మూసివేయనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. నెహ్రూ ఔటర్ రింగ్‌రోడ్, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేపై విమానాశ్రయానికి వెళ్లే వాహనాలను తప్పా ఇతర వాహనాలకు అనుమతి లేదు.

### క్యాబ్ డ్రైవర్లు రైడ్ నిరాకరిస్తే జరిమానా

ఈ నెల 31న, జనవరి 1న క్యాబ్ డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రైడ్ నిరాకరించవద్దని, రైడ్ నిరాకరించి, నిబంధనలు ఉల్లంఘించినవారికి రూ.500జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఎవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే 9490617346 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చున్నారు.

### నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

- రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజామున 2గంటల వరకు నెక్లస్‌రోడ్డులోని ఎన్‌టీఆర్ మార్గ్, పీవీఎన్ఆర్ మార్గ్, అప్పర్ ట్యాంక్‌బండ్‌పై వాహనాల రాకపోకలను నిలిపివేస్తామని తెలిపారు.
- ఖైరతాబాద్ వీవీ విగ్రహం నుంచి నెక్లస్‌రోడ్డు వైపు వచ్చే వాహనాలను వీవీ విగ్రహం వద్ద దారి మళ్లించి నిరంకారి, రాజ్‌భవన్‌రోడ్ మీదుగా అనుమతించనున్నారు.
- బీఆర్‌కే భవన్ నుంచి ఎన్‌టీఆర్ మార్గ్ వైపు వచ్చే వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ వద్ద దారిమళ్లించి ఇక్బాల్‌మినార్, లక్డీకాపూల్, అయోధ్య జంక్షన్ మీదుగా అనుమతిస్తారు.
- లిబర్టీ నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్ వైపు వచ్చే వాహనాలను అంబేద్కర్ విగ్రహం, తెలుగుతల్లి, ఇక్బాల్ మినార్, రవీంద్రభారతి మీదుగా అనుమతిస్తారు

# నేటి తరానికి ఆదర్శం బాపు పుస్తకం

- కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బి.వినోద్‌కుమార్
- ఈ పుస్తకాన్ని సినిమా తీస్తా : రసమయి
- మానకొండూర్‌లో 'బాపు పుస్తకం' ఆవిష్కరణ



మానకొండూర్‌లో బాపు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బి.వినోద్‌కుమార్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, తదితరులు

మానకొండూర్, డిసెంబర్ 30 : ఒక సామాన్య రైతు జీవిత చరిత్ర, తన పిల్లలను చదివించడానికి అతడు పడ్డ కష్టాలు, గొప్పగా చదువుకుని సమాజంలో గౌరవంగా బతుకాలనే తండ్రి చెప్పిన మాటలు, తండ్రి కొడుకుల అనుబంధాన్ని కండ్లకు కట్టినట్లు జర్నలిస్ట్ గడ్డం సతీశ్ రచించిన 'బాపు' పుస్తకం నేటి తరానికి ఆదర్శనీయమని కరీంనగర్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ అన్నారు. శనివారం కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని మీనాక్షి కన్వెన్షన్ హాల్‌లో 'నమస్తే తెలంగాణ' సీనియర్ జర్నలిస్ట్ గడ్డం సతీశ్ రాసిన 'బాపు' పుస్తక ఆవిష్కరణ సభకు వినోద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై, రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రచయిత సతీశ్ తండ్రి గడ్డం రామస్వామి ఆశయం గొప్పదని కొనియాడారు. తాను చదువుకోకున్నా తన పిల్లలను చదివించడానికి అతడు పడిన కష్టాలు, బాధలు వెలకట్టలేనివన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ తెలంగాణలో బాపు పిలుపునకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. బాపు వ్యక్తిత్వాన్ని పుస్తక రూపంలో కండ్లకు కట్టినట్లు చెప్పాడని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ సతీశ్‌తో నాకున్న అనుబంధం అన్న తమ్ముళ్లదని చెప్పారు. నేటి కాలంలో తండ్రుల యొక్క ఆస్తులు, సంపాదన పంచుకుంటున్న వారు ఉంటున్నారని, కానీ సతీష్ మాత్రం తండ్రి ఆశయాన్ని, ప్రేమను, జీవితాన్ని పంచుకున్నాడని గుర్తుచేశారు. తండ్రి కొడుకుల అనుబంధాన్ని చాటిన ఈ పుస్తకాన్ని సినిమా గానీ, డాక్యుమెంటరీ గానీ తీస్తానని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ బాపు యాదిలో పుస్తకాన్ని రచించిన సతీష్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ సతీశ్ ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఉన్నత స్థాయికి వెళ్లడం అభినందనీయమన్నారు. రచయిత గడ్డం సతీశ్ మాట్లాడుతూ మా బాపు సామాన్యుడు, ఎన్నడూ కూడా ఇళ్లు, భూమి కొనుక్కోవాలని కోరుకోలేదని, రేపటికి ఉంటే సరిపోతదని అనుకున్నాడని గుర్తుచేసుకున్నాడు. తనను అన్ని రకాలుగా ఆదుకుని సహాయ సహకారాలు అందిస్తున్న 'నమస్తే తెలంగాణ' యాజమాన్యానికి రుణపడి ఉంటానని, ఈ పుస్తకాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువస్తానని చెప్పారు. సభాధ్యక్షుడు ఇట్యాల వెంకటకిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈఆర్‌సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగరావు, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సినీ విమర్శకులు వారాల ఆనంద్, నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్, బ్యూరో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావు, స్టాఫర్ దొంత వెంకటస్వామి, టీన్యూస్ ప్రతినిధి వేణుగోపాల్‌రావు, రచయిత తల్లి గడ్డం అజ్జిరవ్వ, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, పలువురు కవులు, కథకులు జూకంటి జగన్నాథం, అన్నవరం దేవేందర్, కేఈవీ నరేందర్, గాజోజు నాగభూషణం, పెద్దింటి అశోక్‌కుమార్, బూర్ల వెంకటేశ్వర్లు, కూకట్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## దరఖాస్తులను సజావుగా నింపండి

- ఒక్క కుటుంబానికి ఒకే దరఖాస్తు ఉండాలి
- రేషన్ కార్డులకోసం ప్రత్యేకంగా నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ప్రజాపాలన దరఖాస్తులలో అన్ని కాలమ్‌లను సజావుగా నింపేవిధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను అదేశించారు. శనివారం బహదూర్‌పురా నియోజకవర్గంలోని కిషన్‌బాగ్ పార్కు, చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని ఎన్‌సీఏ, చార్మినార్ నియోజకవర్గంలోని పేట్ల బురుజులో ఏర్పాటు చేసిన కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను, సమర్పిస్తున్న దరఖాస్తులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు దారులతో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల కింద లబ్ధి పొందేందుకు నింపిన ఫారాలను పరిశీలించారు. ఒక్కో కుటుంబానికి ఒక్క దరఖాస్తు మాత్రమే ఉండాలన్నారు. అయితే రేషన్ కార్డు కోసం ప్రత్యేకంగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, బహుదూర్‌పురా ఎమ్మెల్యే మహమ్మూద్ ముబీన్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు వెంకన్న, సంధ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో ఘనంగా ఆట వేడుకలు

### సినీహీరో రాజేంద్రప్రసాద్‌కు ఆట లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



రాజేంద్రప్రసాద్‌ను అవార్డుతో సత్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, డిసెంబర్ 30 : అమెరికా తెలుగు సంఘం(ఆట) ముగింపు వేడుకలు శనివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వివిధ రంగాలకు చెందిన అనేక మంది నిపుణులను, సంఘ సేవకులను, కళాకారులను మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఆటా ప్రెసిడెంట్ మధు బొమ్మినేని, ఎలక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా నాయకత్వంలో సంబురాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సినీనటుడు రాజేంద్రప్రసాద్‌కు ఆట లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మాతృభూమికి ప్రవాసులైన తెలుగువారు అందిస్తున్న సేవలు కొనియాడారు. ఆటా అందిస్తున్న సేవలు తెలుగు రాష్ట్రాల్లోని అనేక మందిని సేవాభావంవైపు మళ్లించి వారిలో స్ఫూర్తిని నింపుతాయని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రవాసభారతీయులు ఏ దేశంలో ఉన్నా మాతృదేశాన్ని మరవకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు మాట్లాడుతూ ప్రవాసభారతీయులు రెండు తెలుగు రాష్ట్రాలకు మరిన్నీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటపల్లి వెంకటరమణారెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఆట ఎలక్ట్‌ప్రెసిడెంట్ జయంత్ చల్లా, అధ్యక్షురాలు మధు బొమ్మినేని, కోశాధికారి సతీష్‌రెడ్డి, పూర్వ అధ్యక్షుడు పరమేశ్ భీమ్‌రెడ్డి, ఈశ్వర్ బండా, అనిల్‌కుమార్ బోయినపల్లి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.



లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు పొందిన రాజేంద్రప్రసాద్‌తో ముచ్చటిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు